నిపుణుడు నమ్మితే చెడిన నది కథ
లేక
కాలుష్యం కథ

దేశాయి "బుద్ధి గడ్డితిని డబ్బు ఈ ఫాక్టరీలో పెట్టాను. మద్రాసీ సినిమా మీద పెట్టినా ప్రాణానికి సుఖంగా ఉండును" అనుకున్నాడు. అతగాడా రోజున అల్లా అనుకోడం పదోసారి.

"చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభం ఏమిటి నిరంజన్? నీకు అప్పుడే చెప్పాను. నువ్వు వినలేదు" అన్నాడు పటేల్.

"నిజమే సంజయ్! బుద్ధి గడ్డి తిని వినలేదు."

"ఇవాల్టికిది పదకొండోసారి, నువ్వా మాట అనటం. మరోసారి ఆ మాటంటే ఒప్పుకోను. అదొదిలేసి, అసలిప్పుడేం చెయ్యాలో ఆలోచించు" అంటూ మందలించాడు సంజయ్ పటేల్, నిరంజన్ దేశాయిని.

సంజయ్ పటేల్, నిరంజన్ దేశాయి కలిసి ఏడేళ్ల క్రితం ఏదైనా వ్యాపారం చేద్దామనుకున్నారు. ఆపైన ఏదైన పరిశ్రమకి పెట్టుబడి పెడదామనుకున్నారు. అప్పుడు సంజయ్ పటేల్ మద్రాసీ సినిమాల్లో డబ్బూ, సుఖం కూడా ఉందని నిరంజన్ దేశాయికి చెప్పాడు. "ఆడవాళ్లు కావలసివస్తే, మన రాష్ట్రం గొడ్డు పోయిందా! మద్రాసీ సినిమా తారలకి మన వాళ్లేం తీసిపోయారు" అంటూ దేశాయి దేశభక్తి గీతం పాడాడు. పటేల్ మరి మాట్లాడలేదు. పటేల్‌కి తనకేం కావాలో తెల్సు. ప్రస్తుతం అతనికి దేశాయి తాలూకు పెట్టుబడి కావాలి. అందుకని మద్రాసీ తారల్ని మనసులో అసింటా నెట్టాడు.

పటేల్, దేశాయి బోల్డు రోజులాలోచించారు. ఆఖరికి కెమికల్స్ ఫాక్టరీ పెడదామనుకున్నారు. అదైతే పెట్టుబడికి ఢోకా ఉండదని, పెద్ద పెట్టుబడి కూడా అక్కర్లేదని, దాన్ని ప్రభుత్వం జాతీయం చేసే ప్రమాదం తక్కువని దేశాయి అన్నాడు. "మరే మరే" అన్నాడు పటేల్.

ఆ రాష్ట్రంలో మహిమా నది అని ఓ నదుంది. ఆ నదిలో ఏం వేసినా ఆ నీళ్లు పాడవవని, దొరలున్న కాలంలో వాళ్లు దాని మహిమ ఉట్టిదని ఋజువు చెయ్యాలని చాలా తిప్పలుపడి చేతకాక సిగ్గుతో తల వంచుకున్నారని ఓ కథ ఉంది. ఆ నది కొండలని వదిలి లోయల్లో అడుగు పెట్టినచోట ఓ చిట్టడివి ఉంది. అందులో యదేచ్ఛగా కులుకుతూ వంపులు తిరుగుతూ పోతూ ఉంటుంది మహిమా నది. ఆ నది చుట్టూ చిన్న చిన్న గుట్టలున్నాయి. వాటిమధ్య "కొండంత అన్నలు నాకున్నారు" అనుకొనే ముద్దు చెల్లిలిలా మహిమా నది ధైర్యంగా ప్రవహిస్తున్నట్లు అనిపిస్తుంది. అంత అందం చూడగానే మనసు చలించి పటేల్ ఫ్యాక్టరీ అక్కడే పెడదామని ముచ్చట పడ్డాడు. దేశాయికి కూడా ఆ ప్రదేశం నచ్చింది. ఆ స్థలం సంపాదించాడు ఫ్యాక్టరీ కట్టడం కోసం.

చెట్లు నరికారు. గుట్టలు చదును చేశారు. మహిమా నది బట్టబయలైంది. ఫ్యాక్టరీ కట్టడానికి కూలీలు వచ్చారు. వాళ్లకి టీలు, కల్లు అమ్మడానికి మరొకరు వచ్చారు. వీళ్లందరికీ చాకలి, మంగలి కావల్సి వచ్చారు. పెళ్లాలని ఇంట్లో వదిలేసి వచ్చినవారికి మరెవరో కావల్సి వచ్చారు. ఇల్లా ఏమీ లేనిచోట గుడిసె పక్క గుడిసె, కొట్టు పక్కన కొట్టు వెలిశాయి. ఎగువన మంచి నీళ్లు తాగి దిగువన బట్టలుతుక్కున్నారు, కాలకృత్యాలు తీర్చుకున్నారు. కాని మహిమా నది మైల పడలేదు. చుట్టాలు వచ్చినప్పుడు కొద్ది రోజులు శ్రమ పడ్డ పడతి వాళ్లు వెళ్లిన కొద్ది రోజుల్లో గుక్క తిప్పుకున్నట్టుగా, కొద్ది దూరం ప్రవహించి సేదతీరి మళ్లీ స్వచ్ఛంగా, గల గలా ప్రవహించింది.

అయిదేళ్ల క్రితం ఫ్యాక్టరీ పన్జేయడం మొదలు పెట్టింది. ఆ సమయంలోనే దేశాయికి తన బుద్ధి గడ్డి తిన్నదేమోనన్న అనుమానం కలిగింది. పనివాళ్లతో తగువులు మొదలయ్యాయి. "ఈ ప్రభుత్వం తనకు ఎదురు తిరిగిన రైల్వే వాళ్లని, మరోళ్లని నిర్దాక్షిణ్యంగా అణిచేస్తుందా! అదే ప్రైవేటు ఇండస్ట్రీస్‌లో పనివాళ్లను వెనకేసుకొస్తుంది. తనకో సూత్రం మనకో సూత్రం" అన్నాడు దేశాయి. "మరే మరే" అన్నాడు పటేల్. పనివాళ్లకి దిగువున ఇళ్లు కట్టించారు.అక్కడ కొన్నాళ్లున్నాక "దిగువకి వచ్చే నీళ్లలో 'మందులు' ఉంటున్నాయి. మా కెగువనే ఇళ్లు కావా" లన్నారు పనివాళ్లు. "మరే మరే" అన్నాడు పటేల్. దేశాయికి విసుగు పుట్టడం మొదలు పెట్టింది. పటేల్ పని విసుగు పుట్టకుండా పనిలోకి వచ్చే ఆడవారి వెల్ ఫేర్ విషయంలో శ్రద్ధాసక్తులు చూపిస్తున్నాడు. దేశాయి తల్లకిందులుగా తపస్సు చేసి పనివాళ్ల ఇళ్ల కోసం ఎగువన స్థలం సంపాదించాడు.

రెండేళ్ల క్రితం ఫ్యాక్టరీ పూర్తి కెపాసిటీతో పన్జేయటం మొదలు పెట్టింది. మహిమా నది తనని ఆక్రమించుకోవాలని చూస్తున్న దుష్టుడితో పోరాడి అలసి పోయి ఓడి పోయిన ఆడపిల్ల లాగా కలుషితమై పోయింది. మహిమా నది మహిమ మట్టిలో కల్సిపోయింది.

ఒకసారి శీలం చెడిన ఆడదాన్ని పూర్తిగా పాడుచేసి గాని విడువరు మనుషులు. ఒక పరిశ్రమ కనుక ఓ నది దగ్గర వెలిస్తే దాని చుట్టూ మరికొన్ని పరిశ్రమలు వెలుస్తాయి. మహిమా నది మరికొంత మంది పారిశ్రామికుల్ని ఆకర్షించింది. పది మైళ్ల దిగువన మరో పరిశ్రమ

తెలిసింది. 'యాచకో యాచకస్య శత్రువు'. జైన్ పరిశ్రమ పెట్టినప్పటి నుంచి దేశాయికి తలనొప్పి మొదలైంది.

జైన్ ముందరగా దేశాయి అండ్ పటేల్ కంపెనీవారు కెమికల్స్ కలిపి మహిమా నదిని పాడుచేస్తున్నారని ప్రచారం మొదలు పెట్టాడు. "మహిమా నది శివుడి భార్య అయిన గంగాదేవి అవతారం. ఆవిడను మనుష్య మాత్రులమైన మనం పాడు చెయ్యడం ఏమిటీ? ఇదో పెద్ద జోక్!" అని పటేల్ ప్రచారం చేసాడు. పుణ్య భారతదేశంలో మహిమలకే ఎక్కువ గౌరవం. మహిమలు చూపిన సన్యాసి, చూపని వేదాంతి కంటే గొప్పవాడు! ఈ విషయం పటేల్‌కు బాగా తెల్సును. అందుకని ఎవరైనా "ఏమిటీ జైనుగ్గాని మతి బోయిందా! మహిమా నదేమిటి? మైల పడటం ఏమిటి?" అని బాహాటంగా తన పక్షం మాట్లాడ్తుంటే "మరే మరే" అంటాడు.

దేశాయి, పటేల్ వాళ్ల అడ్డాలో ఉన్న మహిమా నది మీద వాళ్ల పట్టు సడలించాలెల్లాగైనా అని జైన్ పట్టు పట్టాడు. అతని అదృష్టం కొద్దీ అతని ఫ్యాక్టరీలో పన్జేసే పనివాళ్లు కొందరు, ఆ నదిలో కాలుష్యం వల్ల చచ్చిన చేపలు ఒడ్డుకు కొట్టుకువస్తే, వండుకు తిని చచ్చారు. వాళ్లు తినగా మిగిలిన చేపల కూరని పరీక్షలకి పంపి దానివల్లే వాళ్లు చచ్చారన్న విషయం నిర్ధారణ అయ్యాక, ఆ పనివాళ్ల కుటుంబాలకి దేశాయి అంట్ పటేల్ కంపెనీ వాళ్లు నష్ట పరిహారం చెల్లించాలని జైన్ గొడవ మొదలు పెట్టాడు. నిజానికి జైన్‌కి, అల్లా అని తన పనివాళ్లకి, కలుషితం కాని నీరు, తాగే మేరకైనా ఏర్పాట్లు చేసే ప్రేమ కూడా లేదు. జైన్ తన పనివాళ్ల దృష్టి తన మీద పడకుండా ప్రభుత్వం స్మగ్లర్స్ మీదకి ప్రజల దృష్టి తరలించినట్టు, దేశాయి పటేల్ మీదకి తిప్పాడు.

"దేశాయి చేత క్రితంసారి ఎన్నికల ఫండ్‌కి చాలా డబ్బు పటేల్ ఇప్పించాడు. అందుకనే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు" అని జైన్ ప్రచారం మొదలు పెట్టాడు. "అవన్నీ మా కనవసరం. మాకు, ఎవరో ఒకరు నష్టపరిహారం చెల్లించాలి" అంటూ కార్మికులు నినాదాలు చేసారు. రాజకీయ నాయకులు వచ్చారు. సమ్మెలు చేయించారు. పోలీసులు వచ్చారు. కాల్పులు సాగించారు. ప్రభుత్వానికి తప్పనిసరై పోలీసు కాల్పుల మీద ఓ దర్యాప్తు సంఘం, మహిమా నది కాలుష్యం మీద ఓ నిపుణుల సంఘం నియమించింది. నిపుణుల సంఘ సభ్యులు మరో వారానికి నీటి శాంపుల్స్ సేకరించటానికి వస్తున్నారని తెలిసింది. అప్పుడే దేశాయి పదకొండు సార్లు తన బుద్ధి గడ్డి తినుండాలని అనుమాన పడ్డాడు. అంటే అతని బుద్ధి పదుకొండుసార్లు గడ్డి తిందని కాదు. అనుమానం పదకొండుసార్లు కలిగిందని పటేల్ గుర్తించాడు.

పటేల్ ఆలోచించాడు. రాత్రింబగళ్లు ఆలోచించాడు. జిన్ తాగుతూ ఆలోచించాడు. జూదం ఆడుతూ ఆలోచించాడు. వ్యభిచరిస్తూ ఆలోచించాడు. వ్యాపారం చేస్తూ ఆలోచించాడు. ఆలోచన పూర్తయ్యాక ఫెళ ఫెళా నవ్వాడు. "ఇంకా ఆర్రోజులున్నాయి కదా" అనుకున్నాడు, దేశాయిక్కూడా తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా పన్జరిపించాడు. నిపుణులు వచ్చారు.

శాంపుల్స్ తీసారు. మూతి బిగించి పరీక్షించారు. పరీక్షించాక తెల్ల మొహం వేశారు. నీళ్లలో చెప్పుకోదగ్గ కాలుష్యం లేదు. ఉన్నది కాస్త మామూలుగా ప్రమాదకరమైన కాలుష్యం అనుకునే స్థాయి కంటే తక్కువగానే ఉంది. ఆ విషయం వాళ్లు ప్రభుత్వానికి వ్రాస్తూ "పనివాళ్లు తిన్న చేపలు కుళ్లిపోయినవి కావచ్చు. వాళ్లు వాడిన మసాలా దినుసుల్లో కల్తీ జరిగి ఉండటం లాటి సాధారణ విషయం వల్ల వారు చచ్చుండవచ్చు. అంతేగాని నీటిలో కాలుష్యకారణం కాదు" అని కూడా వ్రాసారు. మహిమా నది పవిత్రమైనదని "ఆ నదిని కలుషితం చెయ్యడం మన తరం కాదని" పటేల్ కనిపించిన వాళ్లందరితో చెప్పాడు. నష్ట పరిహారం ప్రసక్తే లేదు! ఎంత మంది ఆ నదిలో పట్టిన చేపలు తినలేదు! వాళ్లందరు చచ్చిపోయారా? వీళ్లే ఎందుకు చచ్చిపోయారు? - నూకలు చెల్లి! శివుడాజ్ఞలేందే చీమైనా కుట్టదు! ఇల్లాంటి వాదంతో నెగ్గుకు రావటం మన దేశంలో చాలా సులభం. అందుకని పటేల్ దాన్నే చేపట్టాడు.

దేశాయి ఆశ్చర్యపోయాడు. ఆపైన పటేల్ని పిలిచి "నిపుణులల్లాంటి నివేదికెల్లా రాసారో నీకేమైనా తెలుసునా?" అని అడిగాడు. పటేల్ చిరునవ్వు నవ్వి "ఆ ఆర్రోజులు మన ఫ్యాక్టరీని సగం కెపాసిటీతో పడిపాను. నాలుగు రోజుల పాటు ఎఫ్లుయన్ట్ని, నదిలోకి కాక అడవిలోకి డైవర్ట్ చేసాను. చివరి రెండ్రోజులు డిటెన్షన్ పాండ్స్‌లో ఉంచేసాను. ఈ ఆర్రోజులు, పేరుకి కొద్దిగా నదిలో వదిలాను ఎక్స్‌పర్ట్స్ పొలిమేరల్లోకి వచ్చారన్న కబురు తెలియగానే గొట్టాల నిండుకి ఎఫ్లుయంట్ని నదిలోకి వదలటం మొదలు పెట్టాను. వాళ్లు మన ఫ్యాక్టరీ దగ్గరకు వచ్చి మనం పూర్తిగా మన ఫ్యాక్టరీ కల్మషాన్ని నదిలో కలుపుతున్నామని నమ్మకం కుదిరాక, జైన్ వాళ్ల ఫ్యాక్టరీ దగ్గర శాంపుల్స్ తీసుకోడానికి వెళ్లారు. వాళ్లయితే బర్‌మని జీప్‌లో వెళ్లారు గాని మనం అప్పుడే వదలటం మొదలు పెట్టిన ఎఫ్లుయంట్, వాళ్లు వెళ్లేసరికి, అక్కడకు జేరుకోలేదు. అందుకని వాళ్ల శాంపుల్స్‌లో చెప్పుకోదగ్గ కాలుష్యం లేకపోయింది. వచ్చిన నిపుణుల్లో ఆ లావుపాటి అతనున్నాడు చూసావుగా నిరంజన్! అతనికి దేవుళ్లంటే భయం ఉంది. అతనికి మహిమా నది మహిమ మీద పూర్తి నమ్మకం ఉంది. అందులో నమ్మకం లేకపోవటం పాపమనే నమ్మకం కూడా ఉంది. అతను ఉదర పోషణార్థం సైంటిస్టు. అతను శాస్త్రాన్ని, మహిమల్ని కూడా నమ్ముతాడు. రెండింటిని చెరో అరలోను పెట్టుకుని, అవి కల్సిపోకుండా జాగ్రత్త పడ్డాడు. మహిమా నది మహిమలో నమ్మకం ఉన్న అతనికి ఏ విధమైన అనుమానం అతని రిజల్ట్స్ కలుగుజెయ్యలేదు. అందుకని చచ్చిపోయిన వాళ్లు చచ్చిపోయినా మనం బతికిపోయాం. దేవుడు మనల్ని ఈ ఆపద నుంచి రక్షించాడు. ఎందుకైనా మంచిది నువ్వూనూ, వదినా కలిసి ఓ సారి తిరుపతి వెళ్లి బాలాజీని దర్శించుకు రండి. నేనిక్కడ వ్యాపారం చూస్తూ ఉంటా" అంటూ అసలు విషయం వివరించాడు.

దేశాయికి దైవ భీతుంది. అందుకని పటేల్ మాటలు భయం కలిగించాయి. అందుకని అతనా విషయం ఇంక మాట్లాడ్డల్చుకోలేదు. కాస్సేపు నిశ్శబ్దంగా ఉన్నాడు. ఆపైన "మనం మన ఫ్యాక్టరీని అనుకొని ఉన్న పద్దెకరాల భూమి మనకి కావాలని, దాన్ని ఫారెస్టు శాఖచేత మన కిప్పించమని మనం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుని ఏడాదైంది కదా! దాన్సంగతేమైంది సంజయ్" అని అడిగాడు.

"దానికి ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ఏవో కుంటి సాకులు చెప్తోంది. ఆ సంగతి నే జూసుకుంటాలే నువ్వనవసరంగా బెంగపెట్టుకోకు" అన్నాడు పటేల్.

★ ★ ★

జైన్ కూడా మహిమా నది పట్ల భక్తి పెంచుకున్నాడు. తన ఫ్యాకరీ ముందర ఆ దేవతకి చిన్న గుడి కట్టించాడు. ఆపైన ధైర్యంగా తన ఫ్యాకరీ వేస్ట్ గూడా ఆ నదిలో కలపటం మొదలు పెట్టాడు. మహిమా నది పొడుగునా పరిశ్రమలు వెలిశాయి. మహిమా నది పొడుగునా ఆ దేవత గుళ్లు వెలిసాయి. మహిమా నది మాత్రం నల్లబడి, కంపు కొడుతూ ప్రవహిస్తోంది.

కాలుష్యం గురించి సంపన్న దేశాలలో గొడవ బయల్దేరింది. "డబ్బున్న దేశాలలో ప్రతిదీ సమస్యే. మనకు తిండి, బట్ట, నెత్తి మీద చూరు లాంటి ముఖ్యమైన సమస్యలున్నాయి. అందుకని మనం కాలుష్యం గురించి కంగారు పడక్కరలేదు" అన్నారు మంత్రులు, ముఖ్యులు డబ్బు బాగా ఉన్న వాళ్ల ఇళ్ళల్లోకి కలుషితమైన వాతావరణం జొరబడదు! అది అల్లా వుంచి "నీటి కాలుష్యాన్ని నివారిస్తే ఆస్పత్రుల మీద మందుల, మీద అంతేలసి డబ్బు తగలేయక్కర్లేదు" అన్నారు విజ్ఞులు.

ప్రభుత్వం మొహమాటంగా నీటి కాలుష్య నివారణ చట్టం చేసింది. పారిశ్రామికుల్ని ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ పెట్టి శుద్ధ పరచిన ఎఫ్లుయంట్స్‌నే నదుల్లో వదలమన్నారు.

★ ★ ★

"ట్రీట్‌మెంట్ ప్లాంట్ పెట్టుకోడానికి ఓ పదెకరాల భూమి కావాలి మాకు" అని వ్రాశాడు, పటేల్ అధికారులకి. వాళ్లు అటవీ శాఖ నుంచి వీరు కోరిన స్థలం ఇప్పించారు. అయితే ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ని సిమెంట్ లేని కారణంగా దేశాయి అండ్ పటేల్ కంపెనీవారు కట్టలేదు. సిమెంట్ బతిమాలినా దొరకటం లేదు. పటేల్‌కి బతిమాలడం అంటే అసహ్యం. "మన వంతు వచ్చినప్పుడే, మనం తీసుకోవాలి. అదే ధర్మం. అంతేగాని ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టరాదు" అంటాడు పటేల్ నిజమైన దేశభక్తుడిలాగా. సిమెంటు దొరికినప్పుడు మరోటి దొరకలేదు.

ఏతా వాతా తేలిందేమిటంటే దేశాయి అండ్ పటేల్ కంపెనీవారు కోరుకున్న పదెకరాల భూమి వాళ్లకి దక్కింది.

-ఆంధ్ర సచిత్ర వారపత్రిక, '75

★